క్లుప్తంగా

స్థలం కబ్జాకు యత్నం

కాజీపేట అర్బన్: బీసీ కమ్యూనిటీ హాల్ నిమిత్తం కేటాయించిన స్థలాన్ని గుడిసెలు వేసుకుని కబ్జా చేసేందుకు యత్నించిన వారిని మంగళవారం అడ్డుకున్నారు. కాజీపేట మండల రెవెన్యూ అధికారుల కథనం మేరకు గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లోని నద్దినాలకు చెందిన సుమారు ఎకరం భూమిని గతంలోనే బీసీ కమ్యూనిటీ హాల్‌కే కేటాయించారు. కాగా మంగళవారం కొందరు స్థలంలో గుడిసెలు వేసుకునేందుకు యత్నించి, పలు పార్టీల జెండాలను పాతారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కబ్జాకు పాల్పడిన వ్యక్తులను హెచ్చరించి, జెండాలను తొలగించారు.

కిట్స్‌లో సంస్కృతి ఫెస్ట్



హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సంస్కృతి–23 ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ సెక్రటరీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు తెలిపారు. 17 నుంచి రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఫెస్ట్ వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ తొలి రోజు ప్రముఖ తెలుగు గాయని హారిక నారాయణ్ షో ఉంటుందన్నారు. ముగింపు కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు హేమచంద్ర, డి.జె డానికా మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎ.శంకర్, డాక్టర్ నరిసింహారావు, డాక్టర్ ప్రభాకరాచారి, స్టూడెంట్స్ క్లబ్ ప్రతినిధులు ఐశ్వర్య, జాఫర్ అహ్మద్, సుహాస్‌రెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి: ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు సీపీఎం నిర్వహించ తలపెట్టిన జన చైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం హసన్‌పర్తి మండల కార్యదర్శి గుమ్మడి రాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుల్లా అశోక్, సతీస ధర్మారెడ్డి, మౌనిక, సమ్మక్క, అనిఫా, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో కీళ్ల నొప్పులు దూరం

హన్మకొండ చౌరస్తా: వైద్యుడి సూచనలతో సరైన వ్యాయామం, క్రమం తప్పకుండా మందులు వాడితే కీళ్ల నొప్పుల నుంచి విముక్తి పొందవచ్చని ప్రముఖ రుమటాలజీ డాక్టర్ వి.సునీల్ అన్నారు. హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీషియన్ రుమటాలజీ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ రోగులను పరీక్షించి తగు సలహాలు, సూచనలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంపులో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ఎం.మధుకర్, సురేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశీలనాశక్తిని పెంపొందించాలి

హసన్‌పర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న పరిశీలనాత్మక శక్తులను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కార్పొరేటర్ గురుమూర్తి పిలుపునిచ్చారు. 66వ డివిజన్ నేతాజీ శిశు మందిర్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను కార్పొరేటర్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ వలస జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ జిల్లా చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బండి రమేశ్‌కు సేవా రత్న అవార్డు

ఖిలా వరంగల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఓరుగల్లు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల్లో రాణిస్తున్న శివనగర్‌కు చెందిన బండి రమేశ్ సేవా రత్న నేషనల్ 2023 అవార్డును అందుకున్నాడు. ఈనెల 12న తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రమనియన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ శివనగర్‌లో జరిగిన సమావేశంలో రమేశ్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఓరుగల్లు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

నిట్‌లో అవగాహన సదస్సు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో మంగళవారం అంతర్జాతీయ గణిత దినోత్సవ వేడుకల్లో భాగంగా నిట్ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మాస్టర్స్ జాయింట్ అడ్మిషన్ టెస్ట్ (జామ్)పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. మాస్టర్స్ డిగ్రీలో ప్రవేశానికి గాను జామ్ ప్రవేశ పరీక్షపై అవగాహనతో పాటు మెళకువలను అందజేసేందుకు సదస్సును ఏర్పాటు చేసినట్లు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నయీంనగర్: శ్రీదేవసేనను సన్మానిస్తున్న ప్రతినిధులు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్



సంధ్యారాణిని సన్మానిస్తున్న తనిష్క్ ప్రతినిధులు

నయీంనగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా పెండ్లి త్రివేణిరెడ్డి, పొన్నాల సంయుక్తల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవసేనను లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీదేవసేన మాట్లాడారు. లయన్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా గవర్నర్ కన్నా లక్ష్మీనారాయణ, సోషల్ ఆక్టివిస్ట్ కె.అనితారెడ్డి, లయన్స్ ఎస్.వెంకటేశ్వర్‌రావు, కె.వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాసరావు, కె.నివేదితరెడ్డి, ఎం.అరుణారెడ్డి, టి.శారద మహిళలు పాల్గొన్నారు.

కాశిబుగ్గ: సమాజాభివృద్ధి, కుటుంబ నిర్మాణంలో మహిళల పాత్ర మరువలేనిదని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓసిటీ స్టేడియంలో మహిళా క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుటుంబాన్ని సంస్కారవంతంగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర అద్వితీయమన్నారు. జూడో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్, షటిల్‌తో పాటు 16 రకాల క్రీడల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడాపోటీల్లో మహిళా కార్పొరేటర్లు ఓని స్వర్ణలత, కావటి కవిత, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, శిరీష, సువర్ణ, డీవైఎస్‌ఓ ఎస్.ఇందిర, మెప్మా డీఎంసీ రేణుక, పద్మ, కైలాష్ యాదవ్ కోచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వరంగల్: మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తూ పురుషులకు సమానంగా ఎదుగుతున్నారని కాళోజీ వైద్య ఆరోగ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్యారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకొని ములుగు రోడ్డులోని తనిష్క్ జ్యూలరీ స్టోర్స్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనేషన్ మోటివేటర్ కల్యాణి, ప్రముఖ సమాజ సేవకురాలు యశోధ నారాయణరావు, హరిప్రియ, వాణి, రత్నకుమారి, మాధురి, నీరజ, రోషన్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రామన్నపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ వెంకటేశ్వర గార్డెన్‌లో మంగళవారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ వేడుకలకు మేయర్ సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్యలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ప్రావీణ్యం చూపాలి..!

జిల్లా పాలనలో తనదైన ముద్రకు శ్రమించాలి

- ప్రభుత్వ పథకాల అమలుకు పూనుకోవాలి
- పంచాయతీ, మున్సిపాలిటీలపై దృష్టి సారించాలి
- వరంగల్ కొత్త కలెక్టర్ ప్రావీణ్య ముందు సవాళ్లెన్నో..



సాక్షి, వరంగల్: జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్య ముందు ఎన్నో సవాళ్లున్నాయి. ప్రగతి పథంలో జిల్లాను నడిపించడానికి ఎక్కువగా కృషి చేయాల్సి ఉంటుంది. వచ్చేది ఎన్నికల కాలం అయినందున రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోయే పథకాల అమలు తీరు బాగుండాలని అనుకుంటుంది. ఇప్పటికే పట్టాలెక్కిన పల్లె.. పట్టణ ప్రగతి పనులను మరింత చురుగ్గా చేయాల్సి ఉంటుంది. హరితహారం కింద చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సి ఉంది. రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం.. వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాల్సి ఉంటుంది. వీటికితోడు అనునిత్యం కలెక్టరేట్‌కు వచ్చే రెవెన్యూ(భూ) సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి.. పరిష్కరించడంలోనూ 'ప్రావీణ్య'ం చూపేందుకు బాగానే కసరత్తు చేయాలి. ఇప్పటికే ఏడాదిన్నరపాటు కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన గోపి.. తొలినాళ్లలో రెవెన్యూ శాఖపై కాస్త నిదానంగా ఉన్నా ఆ తర్వాత వేగిరం పెంచారు. అన్ని విభాగాలపై పట్టు సాధించిన క్రమంలోనే ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన కొత్త కలెక్టర్ ప్రావీణ్య పరిపాలనాపరంగా అన్నీ గాడిలో పెట్టాలంటే కొంత సమయం తీసుకోవచ్చని కలెక్టరేట్ వర్గాలు అంటున్నాయి. అయితే ఎన్నికలకు కొద్ది నెలల సమయం మాత్రమే ఉండడంతో ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లా ప్రగతిని ముందుకు తీసుకెళ్లడం కత్తిమీద సామేనని అధికారులు చర్చించుకుంటున్నారు.

ప్రజలకు చేరువగా ఉండాలి..

దాదాపు ఏడాదిన్నరపాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రావీణ్యకు వరంగల్ నగరంపై ఇప్పటికే ఓ అవగాహన ఉంది. అయితే గ్రామీణ ప్రాంతాలైన వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న సమస్యలను తెలుసుకోవాల్సి ఉంది. ఇవేకాక అనేక సమస్యలకు ఆలవాలమయ్యే గ్రామీణ ప్రాంతాల్లో కలెక్టర్ ప్రావీణ్య సుడిగాలి పర్యటనలు చేయాల్సిన అవసరం ఉంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సమయంలో గ్రీవెన్స్ సెల్ మినహా మిగతా సమయాల్లో ప్రజలు సమస్యలతో వచ్చినా పెద్దగా పట్టించుకునేవారు కాదన్న అపవాదు మూటగట్టుకుంది. అయితే అందుకు భిన్నంగా ఉండే గ్రామీణ ప్రాంత ప్రజలతో కలెక్టర్ ప్రావీణ్య కలుపుకొని పోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఎన్నికల కాలంలో రాజకీయ నేతల నుంచి వచ్చే ఒత్తిళ్లను అధిగమిస్తూ ముందుకు సాగడం అంతా ఈజీ కాదనే టాక్ వస్తోంది.

విభాగాలవారీగా...

కలెక్టర్ ప్రావీణ్య జిల్లాపై పట్టు పెంచుకునేందుకు విభాగాలవారీగా సమీక్షలు చేపట్టారు. ఇప్పటికే అన్ని విభాగాల అధికారులతో ఇంటరాక్ట్ అయ్యారు. తొలుత రెవెన్యూ అధికారుల నుంచి భూ సంబంధిత సమస్యలు తెలుసుకోనున్నారు. ఆ తర్వాత విద్య, వైద్యారోగ్యం, మైనింగ్, పౌరసరఫరాల విభాగం, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ.. ఇలా అన్ని విభాగాలతో సమీక్ష చేయనున్నారు. ఆయా విభాగాల్లో ఉన్న సమస్యలను తెలుసుకోవడం ద్వారా తదనుగుణంగా పరిష్కరించేందుకు వీలుకానుంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అజంజాహి మిల్లు ప్రాంగణంలో సువిశాల 20.32 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణంతోపాటు ఇతర ముఖ్య అధికారుల నివాస ప్రాంగణాలు తదితర పనులకు టెండర్ పిలిచి సాధ్యమైనంత తొందరగా పనులు చేపట్టాల్సి ఉంది.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్

హసన్‌పర్తి: తెలంగాణ ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. ఒకటో డివిజన్ పెగడపల్లికి చెందిన ఓరుగంటి సమ్మయ్యకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే మంగళవారం హన్మకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

55వ డివిజన్‌లో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ బీమారంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య శ్రీలో వర్తించని వ్యాధులకు సీఎం సహాయనిధి కింద ఆదుకుంటున్నట్లు చెప్పారు. రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్ బాబు, బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాయకంటి సుధాకర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు రవీందర్, యూత్ అధ్యక్షుడు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోండి



నయీంనగర్: ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య మహిళ క్లినిక్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఏ విధంగా మహిళలకు సేవలందిస్తున్నారని, ఏయే పరీక్షలు చేస్తున్నారని అక్కడి వైద్యాధికారిణి అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలోని పోచమ్మకుంట, శాయంపేట, సిద్దాపూర్, ఆత్మకూర్, గోపాలపూర్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళలకు సంబంధించిన 8 అంశాలపై ఆరోగ్య మహిళా క్లినిక్ సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా.బి.సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.ఎండీ యాకుబ్‌పాషా, డా.దీప్తి, వి.అశోక్‌రెడ్డి, ఆస్పత్రి ల్మిక్ అధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారుల సహకారంతో రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు మంగళవారం సుమారు రూ.10 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడుతూ నీటి సౌకర్యం కోసం స్టేడియంలో బోర్‌వెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే స్టేడియం వద్ద పే అండ్ యూజ్ మోడల్ సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఆయన తెలిపారు. స్టేడియం అభివృద్ధి పనులకు సహకరించిన మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, డివిజనల్ సెక్రటరీ పి.రవీందర్‌కు కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జి.రాజేశ్వర్‌రావు, ఐఓడబ్ల్యూ, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ సంస్థ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

దేశాయిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌కుమార్‌జోషి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని దేశాయిబంగ్లా సమాఖ్య భవన్‌లో కంటి వెలుగు పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

ఇసుక లారీ వెల్ఫేర్ అసోసియేషన్ అడహక్ కమిటీ

వరంగల్: కాకతీయ ఇసుక లారీ వెల్ఫేర్ అసోసియేషన్ అడహక్ కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం ఆరెపల్లి సమీపంలోని కార్యాలయంలో తెలంగాణ కమిటీ కోశాధికారి వేముల భూపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయి కార్యవర్గం ఎన్నుకునేంత వరకు నూతన అడహక్ కమిటీ సభ్యులుగా సుమన్, రమేష్, రవి, సోముల, పోతరాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారితో ప్రమాణం చేయించారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పలయ్య, మహిళలు

హన్మకొండ: బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ఈ నెల 17న హనుమకొండ కుడా మైదానంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉప్పలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ సమ్మయ్యనగర్‌లో బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం ప్రమాదంలో పడిందన్నారు. ఈ నెల 17న జరిగే బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సరిత, స్వప్న, మౌనిక, అలీషా, ఆర్సియా, సల్మా, స్వాతి, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వద్దకు బిల్లుల చెల్లింపు వివాదం

హసన్‌పర్తి: సీతంపేటలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు వివాదం ఎమ్మెల్యే అరూరి రమేశ్ వద్దకు చేరింది. గ్రామ పంచాయతీకి సంబంధించిన సుమారు రూ.5.30లక్షల నిధులతో ఏడాది క్రితం అభివృద్ధి పనులు చేసినప్పటికీ చెక్కుపై సంతకం చేయడానికి ఉపసర్పంచ్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ సోమవారం సభ్యురాలు శ్యామల దీక్షకు దిగిన విషయం విధితమే. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే రమేశ్ ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులు రత్నాకర్‌రెడ్డి, రఘు, బండి రజనీకుమార్‌తో పాటు మండల పంచాయతీ అధికారి రవిబాబులు సీతంపేటలో పర్యటించారు. బాధితులు, ఉపసర్పంచ్‌తో మాట్లాడారు. చెక్కుపై సంతకం అభ్యంతరం ఎందుకని వారు తెలుసుకున్నారు. అయితే ఏడాది క్రితం పనులు జరిగితే ఇప్పటి వరకు బిల్లులు ఎందుకు తీసుకోలేదని ఉపసర్పంచ్ భగవాన్‌రెడ్డి కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అసలు పని ఎక్కడ జరిగిందో తెలియదని, ఈ విషయమై ఆర్టీఐలో కూడా దరఖాస్తు చేసుకున్నానన్నారు. కాగా ఈ వ్యవహారంపై సమన్వయ కమిటీ సభ్యులు ఓ నిర్ణయానికి వచ్చారు. నేడు (బుధవారం) ఎమ్మెల్యే రమేశ్ వద్దకు రావాలని సూచించారు. అక్కడే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆస్కార్ రావడం గర్వకారణం

కేయూ క్యాంపస్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో అద్భుతమైన పదజాలంలో చంద్రబోస్ రాసిన నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఓరుగల్లుకు గర్వకారణమని కేయూ సీనియర్ రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ మంద వీరస్వామి అన్నారు. మంగళవారం కేయూ గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం ఇన్‌చార్జ్ డాక్టర్ సుజాత, డాక్టర్ వోడపెల్లి మధు, జావెద్, లంక రాజగోపాల్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లికి చెందిన వీర రాజేష్ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజన్‌బాబు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న రాజేష్ చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆయనకు భార్య హైమ, ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తిపై వేధింపుల కేసు నమోదు

ఖిలా వరంగల్: యువతిని వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లేబర్ కాలనీ చెందిన ఓ ముస్లి మహిళ భర్త ఉద్యోగరిత్యా సౌదీలో ఉంటున్నాడు. ఆమె తన 22 ఏళ్ల చెల్లి, నలుగురు పిల్లలతో కలిసి లేబర్ కాలనీలో నివాసం ఉంటోంది. కీర్తినగర్‌కు చెందిన షేక్ అన్వర్ అనే వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సౌదీలో ఉంటున్నాడని తెలుసుకున్న అన్వర్ యువతి వెంటపడటం, పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాధిత యువతి అక్క ఫిర్యాదు మేరకు అన్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్, కారు ఢీ..

మొరం టిప్పర్ కారును బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి నర్సంపేట రహదారి లేబర్‌కాలనీలోని తెలంగాణ జంక్షన్ సమీపంలో సిద్దిపేట జిల్లా మద్దూరు గ్రామానికి చెందిన శ్రీపాద మనోహర్ చారి, సుజాత దంపతులు కారులో వెళ్తుండగా మొరం టిప్పర్ అతివేగంగా ఓవర్‌టేక్ చేయబోయి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసం అవడమే కాకుండా మనోహర చారి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మంగళవారం బాధితుడి కుమార్తె మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మగ్దుమ్

మామునూరు: దేశ భవిష్యత్, నిర్మాణంలో యువత, విద్యార్థులు పాత్ర కీలకమని అంతర్జాతీయ వ్యాఖ్యాత డాక్టర్ మగ్దుమ్, సైకాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరావు అన్నారు. మంగళవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పింది ఆనందబాబు అధ్యక్షతన పదో తరగతి పరీక్షలపై విద్యార్థుల సంసిద్ధత, కెరియర్ కౌన్సెలింగ్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ఏకగ్రతతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అలివేలు మంగ, పూల రవి, చల్ల, కృష్ణ, జయ శ్రీ, కటకం రఘు, మిట్టపెల్లి శివాజీ, పాక శ్రీనివాస్‌రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలి

వరంగల్: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ పోగు అశోక్ సూచించారు. ఎల్బీనగర్‌లోని చార్‌బౌళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కవిత ఆధ్వర్యంలో మోటివేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పోగు అశోక్ విద్యార్థులకు పరీక్షలలో ఎలా విజయం సాధించాలో వివిధ రకాల సూచనలు చేశారు. ఆత్మ విశ్వాసం నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుందని తెలిపారు.

ఎమ్మెల్యే లింగయ్యపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ శ్రేణులు

ఖిలా వరంగల్: మహిళలను అగౌరవ పరిచే విధంగా మాట్లాడిన నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చిరుమారుతి లింగయ్యపై ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజుతో పాటు మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మంగళవారం మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గంట రవికుమార్, కనుకుంట్ల రజింత్, పిట్టల కిరణ్, కందిమల్ల మహేష్, భాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: నకిరేకల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చిరుమారుతి లింగయ్య మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఇంతేజార్ గంజ్, మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వన్నాల వెంకటరమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

విద్యారణ్యపురి: సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ఆచార్యులు డాక్టర్ సీహెచ్ స్నేహలతారెడ్డి కోరారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతిని పురస్కరించుకొని ఫిజిక్స్ విభాగంలో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సంజీవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కుడా చైర్మన్

నయీంనగర్: నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యను కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

మానవీయ విలువలు బలహీన పడుతున్నాయి



హసన్‌పర్తి: రోజురోజుకు మానవీయ విలువలు బలహీనపడుతున్నాయని బలగం సినియా ఫేం కేతిరి సుధాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో కేతిరి సుధాకర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బలగం సినిమా క్యారెక్ట్ ఆర్టిస్ట్ ప్రభాకర్, డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ ఎన్. శ్రీనివాస్, సమన్వయ కర్త మూల రాము, ఏఓ వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.